సాక్షి అనకాపల్లి
గురువారం । 11 । జూలై । 2024



క్యాన్సర్ స్క్రీనింగ్‌పై శిక్షణ

విశాఖ: క్యాన్సర్ స్క్రీనింగ్‌పై హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్ పర్యవేక్షణలో వైద్యులకు, సిబ్బందికి నెల రోజులపాటు శిక్షణ ఇచ్చారు.



అప్పన్నకు ఆర్జిత సేవలు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. అనంతరం నిత్యకల్యాణం నిర్వహించారు.

గరిష్ఠం/కనిష్ఠం
32.8/25.4

వాతావరణం


తేలికపాటి నుంచి మోస్తరు వర్షం ఒకటి రెండు చోట్ల పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

నాడు వద్దని.. నేడు ముద్దని..

- పోలవరం పనుల పరిశీలనకు నేడు సీఎం రాక
- ఆనాడు ప్రాజెక్టు నిర్మించాలని రైతులు కోరినా సాధ్యం కాదన్న చంద్రబాబు
- వైఎస్సార్ హయాంలో ఎడమ కాలువ నిర్మాణం ప్రారంభం
- ప్రాజెక్టు పూర్తి కాకుండానే సస్యశ్యామలమైన పాయకరావుపేట, యలమంచిలి నియోజకవర్గాలు



కాలువలో చేరిన నీటిని ఉపయోగించి వరి సాగు చేస్తున్న రైతులు (ఫైల్)





నిర్మాణంలో ఉన్న పోలవరం కాలువలో చేరిన నీరు, (ఇన్‌సెట్) కాలువలో చేరిన పోలవరం నీటిని ఇంజిన్ల సాయంతో తోడుకుంటున్న రైతులు (ఫైల్)

నక్కపల్లి: పోలవరం ప్రాజెక్టు అనేది అన్నదాతల చిరకాల వాంఛ. దశాబ్దాలుగా రైతులకు ఈ ప్రాజెక్టు కలగానే మిగిలిపోయింది. దాదాపు మూడు దశాబ్దాల క్రితం ముఖ్యమంత్రి హోదాలో నక్కపల్లి మండలం రేబాక పర్యటనకు వచ్చిన చంద్రబాబును ఈ ప్రాంత రైతులు కలిసి పోలవరం ప్రాజెక్టు ఆవశ్యకతను వివరించి నిర్మించాలని కోరారు. రైతుల వినతిపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం సాధ్యం కాదని, ఆ మాట మర్చిపోవాలని బదులిచ్చారు. అదే రైతులకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వరమిచ్చారు. 2003లో పాదయాత్ర చేసిన సందర్భంలో ఈ ప్రాంత రైతుల మొర విని తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తప్పకుండా పోలవరం కాలువ నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. చెప్పిన విధంగానే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే పోలవరం కాలువ నిర్మాణ పనులు ప్రారంభించారు. మహానేత పుణ్యమా అని మెరక ప్రాంతంలో ఖరీఫ్‌కు నీరు పుష్కలంగా అందుబాటులోకి వచ్చింది. ఇద్దరు ముఖ్యమంత్రుల మధ్య ఉన్న వ్యత్యాసం కళ్లకు కట్టినట్టు కనిపించింది. ప్రస్తుతం ఈ ప్రాంత రైతులు పోలవరం కాలువలో చేరిన నీటిని వరి నారుమళ్లకు ఉపయోగిస్తున్నారు. దమ్ములకు, వరి నాట్లు వేసేందుకు, గట్ల పటిష్టానికి ఇదే నీటిని వాడుతున్నారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి కృషి వల్ల బీడు భూముల్లో అన్నదాతలు నాలుగు తిండి గింజలు పండించే పరిస్థితి ఏర్పడింది. 2006లో ఉమ్మడి విశాఖ జిల్లాలో 5, 6, 7 ప్యాకేజీల కింద పాయకరావుపేట, యలమంచిలి నియోజకవర్గాల్లో ఎడమ కాలువ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ మూడు ప్యాకేజీల కింద 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్నది మహానేత ఆశయం. పాయకరావుపేట నుంచి తాళ్లపాలెం వరకు సుమారు 50 కిలోమీటర్ల వరకు ఎడమ కాలువ పనులు దాదాపు 60 శాతం పూర్తయ్యాయి. అక్విడెక్ట్‌ల నిర్మాణ పనులు పూర్తికావాల్సి ఉంది.

మెట్ట భూముల్లో బంగారు పంటలు

ఎడమ కాలువ తవ్వకాలు చేపట్టడం వల్ల ప్రతి ఏటా వర్షాలు పడిన సమయంలో కాలువల్లో పుష్కలంగా నీరు చేరుతోంది. కాలువకు ఇరువైపులా ఉన్న మెట్ట భూముల్లో పోలవరం నీరు పరవళ్లు తొక్కుతోంది. కేవలం అపరాలు పంటు సాగు చేసే రైతులు గత 15 ఏళ్ల నుంచి ఖరీఫ్‌లో వరి సాగు చేస్తున్నారు. పోలవరం కాలువలో చేరిన నీరు ఖరీఫ్, రబీ సీజన్‌లకు పూర్తిగా సరిపోతోంది. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, యలమంచిలి మండలాల్లో పోలవరం కాలువకు ఇరువైపులా సుమారు 10 వేల ఎకరాల మెట్ట భూములు ఉన్నాయి. వీటిలో సుమారు 5 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. పోలవరం కాలవలో నీరు పుష్కలంగా చేరడంతో మోటార్లు, ఆయిల్ ఇంజిన్ల సహాయంతో నీటిని తోడుకుని నారుమళ్లకు ఉపయోగిస్తున్నారు. వర్షాలు అనుకూలించకపోయినప్పటికీ కాలువలో పుష్కలంగా చేరిన నీరు ఖరీఫ్, రబీ సీజన్‌లకు సరిపోతుందని రైతులు చెబుతున్నారు.

పోలవరం కాలువ పనుల పరిశీలనకు వస్తున్న చంద్రబాబు

పోలవరం మాట ఎత్తవద్దన్న అదే చంద్రబాబు ఇప్పుడు పోలవరం పాట పాడుతున్నారు. 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న చంద్రబాబు వైఎస్ హయాంలో ప్రారంభమైన పోలవరం ప్రాజెక్టు, కాలువ నిర్మాణ పనులను పెద్దగా పట్టించుకోలేదు. పోలవరం నిధులను చంద్రబాబు ఏటీఎంలా వాడుకున్నారని సాక్షాత్తూ ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించింది. వేల కోట్లు ఖర్చు చేసి ప్రాజెక్టు పనులు, రాక్‌ఫిల్ డ్యామ్, గేట్లు ఏర్పాటు వంటి పనులు దాదాపు పూర్తి చేశారు. పోలవరం ప్రాజెక్టు ఇప్పుడు తప్పనిసరి అయింది. ఈ ప్రాజెక్టు పూర్తి కాకపోతే రాష్ట్రం అధోగతి పాలవుతుందన్న వాదన వినిపిస్తోంది. దార్లపూడి వద్ద జరుగుతున్న పోలవరం కాలువ పనులు పరిశీలించేందుకు చంద్రబాబునాయుడు గురువారం వస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి చేయడమే తన లక్ష్యమని చెబుతున్నారు. ఈ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు పూర్తవుతుందా లేదా.. గతంలో మాదిరిగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంటుందా అన్నది వేచి చూడాలి.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ఎస్.రాయవరం: సీఎం చంద్రబాబునాయుడు జిల్లా పర్యటనకు రానున్న నేపథ్యంలో బుధవారం రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అధికారులతో కలిసి దార్లపూడిలో ఏర్పాట్లు పరిశీలించారు. పోలవరం ఎడమ కాలువ ప్రాంతాన్ని కలెక్టర్ విజయ్ కృష్ణన్, ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తదితర జిల్లా అధికారులతో కలిసి మంత్రి సందర్శించారు. హెలికాప్టర్‌లో గురువారం మధ్యాహ్నం చేరుకోనున్న సీఎం కోసం ఉన్నత పాఠశాలలో హెలిప్యాడ్ నిర్మించారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో వెళ్లి సుమారు ఒకటిన్నర కిలోమీటరు దూరంలో ఉన్న కాలువ నిర్మాణ పనులను పరిశీలిస్తారు.



దార్లపూడిలో పర్యటిస్తున్న హోం మంత్రి అనిత, కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ మురళీకృష్ణ

వికటించిన ఇంజక్షన్లు సీజ్

- నక్కపల్లి ఆస్పత్రిలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు
- పరీక్షల కోసం నమూనాల సేకరణ
- మొత్తం 625 వైల్స్ ఉపయోగించవద్దని ఆదేశం



నక్కపల్లి ఆస్పత్రిలో ఇంజక్షన్లను పరిశీలించి శాంపిళ్లు సేకరిస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్



అనకాపల్లి ఆస్పత్రిలో కోలుకుంటున్న బాధితులు

నక్కపల్లి: స్థానిక ఏరియా ఆస్పత్రిలో 21 మంది అస్వస్థతకు కారణమైన ఇంజక్షన్ల శాంపిళ్లను సేకరించి పరీక్షల కోసం పంపిస్తున్నట్లు జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి తెలిపారు. బుధవారం ఆమె నక్కపల్లి ఏరియా ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహించారు. మంగళవారం రాత్రి ఆస్పత్రిలో ఇన్‌పేషంట్లుగా చేరిన వారికి చేసిన సెఫటాక్సిమ్ ఇంజక్షన్ వికటించి 23 మంది అస్వస్థతకు గురయిన విషయం తెలిసిందే. జ్వరాలు, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలతో ఆస్పత్రిలో ఇన్‌పేషంట్లుగా చేరిన వారికి యాంటిబయోటిక్ ఇంజక్షన్లు ఇవ్వడం సాధారణమే. రోజు మాదిరిగానే ఈ లక్షణాలతో బాధ పడే వారికి సెఫటాక్సిమ్‌తోపాటు మెటాజిల్ ఇంజక్షన్ కూడా చేశారు. ఘటన జరిగిన ముందురోజు, అదే రోజు ఉదయం కూడా ఇవే ఇంజక్షన్లు చేసినప్పటికీ ఎటువంటి ఇబ్బంది ఏర్పడలేదు. రాత్రి 8 గంటలకు ఇంజక్షన్ చేసిన వెంటనే పది నిమిషాల్లోనే బాధితులకు విపరీతమైన చలి, వణుకు వచ్చి వాంతులయ్యాయి. డ్యూటీలో ఉన్న డాక్టర్ జయలక్ష్మి వెంటనే అప్రమత్తమై ఇంజక్షన్ వికటించిందన్న విషయం గుర్తించి హుటాహుటిన విరుగుడుకు వైద్య సేవలు ప్రారంభించారు. వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి బాధితులను అంబులెన్స్‌లలో అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. దీంతో బాధితులందరికీ ప్రాణాపాయం తప్పింది. ఈ విషయం తెలుసుకున్న డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ బుధవారం నక్కపల్లి ఆస్పత్రిని సందర్శించారు. సెఫటాక్సిమ్ 425 వైల్స్, మెటాజిల్ 200 వైల్స్‌ను ఉపయోగించకుండా సీజ్ చేశారు. వీటి నుంచి శాంపిళ్లను సేకరించి పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు ఆమె తెలిపారు. కేవలం 20 వైల్స్ కలిగిన సిఎక్స్ 23175 బ్యాచ్ నెంబరు ఇంజక్షన్లు మాత్రమే ఈ విధంగా రియాక్షన్ ఇచ్చాయని డాక్టర్ జయలక్ష్మి తెలిపారు. రియాక్షన్ బారిన పడిన రోగులను సాధారణ స్థితికి తెచ్చేందుకు వెంటనే వైద్య సహాయ చర్యలు చేపట్టామని, అనకాపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించామని చెప్పారు.

నాలుగు రోజుల క్రితం అనకాపల్లి ఆస్పత్రిలో ఇదే తరహా ఘటన?

ఇదే తరహా ఘటన నాలుగు రోజుల క్రితం అనకాపల్లి జిల్లా ఆస్పత్రిలో జరిగినట్లు తెలిసింది. అక్కడ కూడా నలుగురికి చేసిన ఇదే ఇంజక్షన్ రియాక్షన్ ఇచ్చి రోగులు అస్వస్థతకు గురయ్యారు. అయితే ఈ వ్యవహారాన్ని గోప్యంగా ఉంచారు. నక్కపల్లిలో రియాక్షన్ ఇచ్చిన బాధితులనందరినీ అనకాపల్లి ఆస్పత్రికి తరలించడంతో అక్కడ వైద్య సిబ్బంది రోగులకు చేసిన ఇంజక్షన్ గురించి ఆరా తీసి ఇక్కడ కూడా ఇదే ఇంజక్షన్ వల్ల ఇబ్బంది అయిందని స్థానిక వైద్యులకు తెలిపినట్లు సమాచారం. అక్కడ జరిగిన వెంటనే జిల్లాలో ఉన్న మిగిలిన ఏరియా ఆస్పత్రులకు ఈ సమాచారం ఇచ్చి ఉంటే జాగ్రత్త పడేవారన్న వాదన వినిపిస్తోంది.

17 మంది డిశ్చార్జ్

అనకాపల్లి: నక్కపల్లి ఆస్పత్రిలో మంగళవారం రాత్రి ఇంజక్షన్ వికటించడంతో అనకాపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించిన వారిలో 17మందిని బుధవారం డిశ్చార్జ్ చేశారు. ఇక్కడ చేర్పించిన 23 మంది రోగుల్లో సింహాద్రి అనే బాధితుడి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఎన్టీఆర్ వైద్యాలయంలో చికిత్స పొందుతున్న ఐదుగురు డయేరియా, పచ్చకామెర్లతో ఇబ్బంది పడుతున్నారని, ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగా ఉందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. మిగతా 17 మందిని డిశ్చార్జి చేశారు.

సంఘటనపై విచారణ

ఇంజక్షన్ వికటించడంపై విచారణ చేపడతామని ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో కె.శ్రీనివాసరావు చెప్పారు. నక్కపల్లి ఘటన గురించి కలెక్టర్ రాష్ట్ర వైద్యవిభాగానికి తెలియజేశారని చెప్పారు. వికటించిన మందును ప్రస్తుతం అన్ని వైద్యాలయాల్లో నిలిపివేశామని, విచారణ నివేదిక అందాక తుది నిర్ణయం తీసుకుంటామన్నారు.

అక్షరంపై అక్కసు

- దెక్కన్ క్రానికల్ కార్యాలయంపై టీడీపీ నాయకుల దాడి
- పచ్చ నేతల దౌర్జన్యాన్ని ఖండించిన రాజకీయ పక్షాలు, సంఘాలు
- ఇది పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణన
- వీరి దుశ్చర్యకు నిరసనగా ఆందోళనకు సిద్ధమవుతున్న జర్నలిస్టు యూనియన్లు



బీచ్‌రోడ్డులోని డెక్కన్ క్రానికల్ కార్యాలయం ఎదుట బ్యానర్‌ను తగలబెడుతున్న తెలుగునాడు మహిళలు

విశాఖ సిటీ : 'ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా' అన్న సామెత తెలుగుదేశం ప్రభుత్వానికి సరిగ్గా సరిపోతుంది. చినబాబు రెడ్ బుక్ పేరుతో ఐఏఎస్, ఐపీఎస్‌లపై బెదిరింపులకు పాల్పడుతుంటే.. టీడీపీ పిల్ల బ్యాచ్ విచక్షణా రహితంగా భౌతిక దాడులకు తెగబడుతోంది. నిన్న మొన్నటి వరకు ప్రభుత్వ నిర్వాకాన్ని ప్రశ్నించిన మీడియా సంస్థలపై బ్యాన్ విధించాలని ప్రయత్నించి.. హైకోర్టు మొట్టికాయలతో చంద్రబాబు ప్రభుత్వం వెనక్కు తగ్గింది. తాజాగా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై ప్రభుత్వ వైఖరిని ప్రశ్నిస్తూ కథనం ప్రచురించిన డెక్కన్ క్రానికల్ పత్రికా కార్యాలయంపై టీడీపీ నేతలు భౌతిక దాడికి తెగబడడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తిస్తోంది.

బీచ్ రోడ్డులో ఉన్న జాతీయ పత్రికా కార్యాలయంలోకి టీడీపీ విద్యార్థి విభాగం నేతలు దూసుకుపోయి రాళ్లతో దాడి చేయడం, డెక్కన్ క్రానికల్ బోర్డుకు నిప్పు పెట్టడం పెను దుమారం రేపుతోంది. అక్షరాల గొంతు నులిమి.. పత్రికా స్వేచ్ఛను హరించి.. రాష్ట్రంలో రాక్షస పాలనకు చంద్రబాబు ప్రభుత్వం నాంది పలికింది. పచ్చనేతల ఈ దుశ్చర్యను పార్టీలకు అతీతంగా అన్ని రాజకీయ పక్షాలు, సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి.

మీడియా అణచివేతకు ప్రభుత్వ పన్నాగం

రాష్ట్రంలో మీడియాను తన చెప్పు చేతల్లో పెట్టుకోడానికి చంద్రబాబు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వామపక్ష పార్టీలు, జర్నలిస్టు సంఘాలు మండిపడుతున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రజలకు మెరుగైన సేవలందించి వారి అభిమానం పొందాల్సిన నేతలు ప్రతీకారంతో, అధికార బలంతో మీడియాపై దాడులు చేస్తూ బలపడాలనుకోవడం సరి కాదని హితవు పలుకుతున్నాయి. ప్రజల పక్షాన నిలుస్తున్న మీడియా, పత్రికలపై దాడులకు పూనుకోవడాన్ని ఖండిస్తున్నాయి. ప్రజల కోసం వినియోగించాల్సిన అధికారాన్ని మీడియా నోరు నొక్కేందుకు ఉపయోగించే వికృత సంస్కృతి సరికాదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. వాదనలో నెగ్గలేని వారే భౌతిక దాడులకు దిగుతారనడానికి ఇదే ఉదాహరణగా పేర్కొంటున్నాయి. తమకు వ్యతిరేకంగా మాట్లాడినా, రాసినా అంతు చూస్తామంటూ ప్రజాస్వామ్య సంస్థలను బెదిరిస్తూ నియంతలా వ్యవహరించడం ప్రభుత్వానికే మంచిది కాదని సూచిస్తున్నాయి. పత్రికా కార్యాలయాలు, పాత్రికేయులపై దాడి చేయడమంటే ప్రజాస్వామ్యంపై దాడి చేయడమే అవుతుందని పునరుద్ఘాటిస్తున్నాయి. ఇదే పద్ధతి కొనసాగితే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరిస్తున్నాయి.

దాడి అప్రజాస్వామికం:సీపీఎం నేత కె.లోకనాథం

అనకాపల్లి: విశాఖ నగరంలోని డెక్కన్ క్రానికల్ ఆంగ్ల దినపత్రిక కార్యాలయంపై టీడీపీ విద్యార్థి విభాగం నాయకులు, టీడీపీ కార్యకర్తలు చేసిన దాడి అన్యాయమని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.లోకనాథం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై డెక్కన్ క్రానికల్లో వచ్చిన వార్తను తట్టుకోలేని టీడీపీ కార్యకర్తలు ఆ పత్రిక కార్యాలయంపై రాళ్లు విసిరి, సంస్థ బోర్డును తగలబెట్టి దాడులకు పాల్పడడం పత్రికా స్వేచ్ఛను కాలరాయడమేనన్నారు. దాడికి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా కథనాలు రాసిన పత్రికా కార్యాలయాలపైన, జర్నలిస్టులపైన దాడులు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుని ప్రజాస్వామ్య హక్కులకు భంగం కలగకుండా చూడాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన కోరారు. ఈ తరహా దాడులను ప్రభుత్వాలు నియంత్రించకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు.

దాడిని ఖండిస్తున్నాం

డెక్కన్ క్రానికల్‌పై టీడీపీ విద్యార్థి, మహిళా విభాగాల కార్యకర్తలు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. స్టీల్‌ప్లాంట్‌కు సంబంధించి వంద శాతం స్ట్రాటిజిక్ సేల్ విషయమై కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలత వ్యక్తం చేసినట్లు వివిధ పత్రికల్లో వచ్చింది. ఇదే వార్త డెక్కన్ క్రానికల్ ప్రచురించింది. ఇది వాస్తవం కాకపోతే టీడీపీ ఖండించాలి. కానీ పత్రిక కార్యాలయం మీద దాడి చేయడం పత్రికా స్వేచ్ఛను హరించడమే అవుతుంది. దాడి చేసిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి.

– ఎం.జగ్గునాయుడు, జిల్లా కార్యదర్శి, సీపీఎం

పత్రికా కార్యాలయంపై దాడి హేయం



ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర ఎంతో గొప్పది. అటువంటి పత్రికా కార్యాలయంపై టీడీపీ గుండాలు దాడి చేయడం హేయమైన చర్య. దీనిని ప్రతి ఒక్కరూ ఖండించాలి. భవిష్యత్‌లో ఎవ్వరూ ఇలా దాడులు చేయకుండా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– మార్టుపూడి పరదేశి, రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్ సీపీ

పత్రికా స్వేచ్ఛపై దాడి సరికాదు



నిత్యం ప్రజలకు సమాచారాన్ని ఇచ్చే మీడియాపై దాడి చేయడం అన్యాయం. ఇది పత్రికా స్వేచ్ఛపై దాడి చేయడమే. పత్రిక రాసిన కథనాలపై అభ్యంతరాలుంటే వాటిపై కౌంటర్ ఇవ్వాలి. అంతేకానీ ఫోర్త్‌ఎస్టేట్ అయిన మీడియా కార్యాలయంపై దాడి చేయడం, కార్యాలయ బోర్డుకు నిప్పుపెట్టడం మంచి పద్ధతి కాదు.

– మంత్రి రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి, స్టీల్ ఐఎన్‌టీయూసీ

దాడి చేసిన వారిని శిక్షించాలి



పత్రికా కార్యాలయంపై దాడి చేయడం అంటే పత్రికా స్వేచ్ఛను హరించడమే. వాస్తవాలను వెలుగులోకి తీసుకు వచ్చి.. ప్రజలకు, ప్రభుత్వాలకు వారధిగా నిలిచేవి పత్రికలు. అటువంటి పత్రికా కార్యాలయంపై దాడి చేయడం దారుణం. నిందితులను కఠినంగా శిక్షించాలి.

– పిట్టా రెడ్డి, ప్రధాన కార్యదర్శి, స్టీల్ వైఎస్సార్‌టీయూసీ

క్లుప్తంగా

నరసింహావతారంలో జగన్నాథుడు



మాడుగుల: జగన్నాథ స్వామి రథోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారు నరసింహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మాడుగుల ఇంద్రద్యుమ్న హాల్లో స్వామివారిని నరసింహునిగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు పండా నూకరాజు సారథ్యం రథోత్సవ కార్యక్రమాలు వైభవంగా జరుగుతున్నాయి.

క్రమేపీ పెరుగుతున్న పెద్దేరు

మాడుగుల రూరల్: ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలో పెద్దేరు జలాశయంలో నీటి మట్టం గణనీయంగా పెరుగుతోంది. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 137 మీటర్లు కాగా, బుధవారం సాయంత్రానికి 136.45 మీటర్లకు పెరిగింది. జలాశయం పరిసరాలల్లో 88 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. ఈ వర్షాలకు 94 క్యూసెక్కులు వర్షపు నీరు జలాశయంలోకి వచ్చి చేరుతుందని జేఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

క్రమం తప్పకుండా టీకాలు వేయాలి



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌దేవ్

మాకవరపాలెం: ఐదేళ్లలోపు పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలను క్రమం తప్పకుండా వేయాలని వ్యాధి నిరోధక టీకాల విభాగం జిల్లా అధికారి చంద్రశేఖర్‌దేవ్ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని తామరం విలేజ్ హెల్త్ క్లినిక్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులకు వేస్తున్న టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు.

నేడు జేఎల్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

కంచరపాలెం, (విశాఖ): విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులాల్లో ఫిజిక్స్, జువాలజీ, కెమిస్ట్రీ, పీఈటీ, సోషల్, టీజీటీ–ఫిజికల్ సైన్సు(ఫిజిక్స్), సోషల్, ఇంగ్లిష్, హిందీ సబ్జెక్టులను బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీలను నియమిస్తున్నారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు గురువారం ఉదయం 10 గంటల నుంచి మేహాద్రిగెడ్డ(ఆర్‌ఆర్‌పురం)లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చు. సంబంధిత సబ్జెక్టు(పీజీ)లో 55 శాతం మార్కులు, బీఈడీ, టెట్ అర్హత కలిగి ఉండాలని, సంబంధిత ధ్రువీకరణ పత్రాల ఒరిజినల్స్, ఒక సెట్ జిరాక్స్ పత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా సమన్వయాధికారి ఎస్.రూపవతి తెలిపారు.

'డ్రాప్' ఆట..!



'ధర్మవరపు దివ్య పెందుర్తి మండలం వెంకటాపురం ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదివింది. ఈ ఏడాది తమ స్వగ్రామమైన శ్రీకాకుళం జిల్లా పలాస స్కూల్లో 6వ తరగతి చేరేందుకు వెళ్లింది. గత నెల 17న ఇక్కడి పాఠశాలలో టీసీ ఇచ్చేసినా, సదరు విద్యార్థిని పేరు డ్రాప్‌బాక్స్‌లో కనిపించకపోవటంతో పలాసలోని స్కూల్లో ఇప్పటి వరకు రికార్డుల్లో నమోదు చేయలేదు. దీంతో స్టూడెంట్ కిట్ అందలేదు.' ఇలాంటి వారు ఇంకెందరున్నారో...

- ఫీజు బకాయిల కోసం ఎత్తుగడలు
- టీసీలు ఇచ్చినా డ్రాప్‌బాక్స్‌లో కనిపించని పేర్లు
- వేరే పాఠశాలలో చేరేందుకు ఆటంకం
- యు–డైస్ ప్లస్‌లో నమోదుకు సాంకేతిక చిక్కులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు
- ఈ విద్యా సంవత్సరంలో తేలని అడ్మిషన్ల లెక్క

విశాఖ విద్య: విద్యాహక్కు చట్టం మేరకు విద్యార్థి తనకు నచ్చిన స్కూల్లో చేరి, నిరభ్యంతరంగా చదువుకోవచ్చు. కానీ, కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్ల నిర్వాహకులు ఫీజు బకాయిలు వసూళ్ల కోసం వారిని వేరే చోట చేరనివ్వకుండా ఆటంకాలు కలిగిస్తున్నారు. మీ ఇష్టం వచ్చిన స్కూల్‌కు వెళ్లిపోవచ్చని పైకి చెబుతున్నా, విద్యార్థుల పేర్లను డ్రాప్ బాక్స్‌లో ఉంచకపోవటంతో మరో స్కూల్లో వారి పేర్లు నమోదుకు సాంకేతికంగా ఇబ్బంది ఎదురవుతుంది. సాంకేతిక సమస్యతో ప్రభుత్వ స్కూళ్లలో కూడా యు–డైస్ ప్లస్‌లో విద్యార్థుల పేర్లు నమోదు సవ్యంగా సాగటం లేదు. దీంతో 2024–25 విద్యా సంవత్సరంలో ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారనే స్పష్టమైన లెక్క తేలడం లేదు.

డ్రాప్‌బాక్స్ అంటే..

ఒక పాఠశాల నుంచి మరొక పాఠశాలకు మారే సందర్భంలో ఆ స్కూల్ నిర్వాహకులు విద్యార్థి పేరును చైల్డ్ ఇన్ఫో నుంచి తొలగిస్తారు. దీంతో విద్యార్థి పేరు ఎడ్యుకేషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో గల డ్రాప్‌బాక్స్‌లోకి చేరుతుంది. వేరొక స్కూల్లో జాయిన్ అయిన తరువాత, అక్కడ మళ్లీ నమోదు చేయటానికి, ముందు చదివిన స్కూల్లో నిర్వాహకులు విద్యార్థి పేరును వారి పాఠశాల యు–డైస్ కోడ్ నుంచి తొలగించి, ఆ పేరును డ్రాప్‌బాక్స్‌లో ఉంచాలి. అలా అయితేనే డ్రాప్‌బాక్స్ నుంచి క్లియర్ అవుతుంది. కానీ కొన్ని ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్ల నిర్వాహకులు ఈ విషయంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.



తమ సమస్యను చెప్పుకుంటున్న విద్యార్థి బంధువులు

సంక్షేమ పథకాలు దూరే..

యు–డైస్‌లో నమోదైన విద్యార్థికే గుర్తింపు ఉంటుంది. ప్రభుత్వ పరంగా అన్ని రకాల సంక్షేమ పథకాలు అందుతాయి. బడులు తెరిచి నెల రోజులు కావస్తున్నా చాలా స్కూళ్లలో విద్యార్థులు వివరాలు నమోదు నిర్లక్ష్యం తాండవిస్తోంది. విద్యార్థులంతా ఏదో ఒక పాఠశాలలో చదువుతున్నారని విద్యాశాఖాధికారులు చెబుతున్నా.. యు–డైస్ ప్లస్‌లో లేనందున వారికి హాజరు నమోదు కాదు. ఇలానే కొనసాగితే విద్యార్థులకు ప్రభుత్వ పరంగా సంక్షేమ పథకాలు అందించేటప్పుడు సాంకేతిక సమస్యలు ఎదురవుతాయి.

ఎంఈవోల పర్యవేక్షణ ఏదీ

డ్రాప్‌బాక్స్ సమస్యలపై తల్లిదండ్రుల నుంచి అందే ఫిర్యాదులపై సీరియస్‌గా స్పందించాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లాలో డ్రాప్‌బాక్స్‌లో ఉన్న విద్యార్థులను గుర్తించి, డ్రాప్‌బాక్స్ నుంచి వారిని క్లియర్ చేసేలా ఎంఈవో స్థాయిలో వెసులుబాటు ఉంది. కానీ ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాల ఒత్తిళ్లకు తలొగ్గుతున్న దిగువస్థాయి విద్యాశాఖాధికారులు ఇవేమీ పట్టించుకోవటం లేదని, అందువల్లనే తమ పిల్లల పేర్లను డ్రాప్‌బాక్స్‌లో కనిపించకుండా చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు.

విద్యాశాఖాధికారులు దృష్టి సారించాలి



విద్యార్థులు నచ్చిన స్కూల్లో చదువుకోవచ్చు. కానీ కొన్ని ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు ఫీజు వసూలు కోసమని టీసీలు సకాలంలో ఇవ్వటం లేదని మా దృష్టికి వచ్చింది. ఇలాంటి వాటిపై పరిశీలన చేస్తున్నాం. విద్యాశాఖాధికారులు సమస్యను పరిష్కరించేందుకు దృష్టి పెట్టాలి. ఇలాంటి వాటిపై బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ తీవ్రంగానే పరిగణిస్తోంది.

– డాక్టర్ జి.సీతారాం, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు

ఆటంకాలు కలిగిస్తే కఠిన చర్యలు



ఫీజుల కోసమని విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయకూడదు. అలాంటి యాజమాన్యాలపై కఠినంగానే వ్యవహరిస్తాం. ఈ ఏడాది అడ్మిషన్లపై ప్రత్యేక శ్రద్ధతీసుకుంటున్నాం. యు–డైస్ ప్లస్‌లో విద్యార్థుల పేర్లు నమోదుతోపాటు డ్రాప్‌బాక్స్ ఉన్న వారి వివరాలను వెంటనే క్లియర్ చేయాలని జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల నిర్వాహకులకు ఆదేశించాం.

– బి.విజయభాస్కర్, ఆర్జేడీ

జిల్లాలో 513 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ



విద్యార్థులతో సంహపంక్తి భోజనాలు చేస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ, డీవైఈవో అప్పారావు

- ఈ ఏడాది కాలేజీలుగా మూడు హైస్కూళ్ల అప్‌గ్రేడ్
- జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ

నాతవరం: జిల్లాలో 513 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ ఉన్నాయని, వీటిని ప్రభుత్వం త్వరలోనే డీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఈ ఏడాది మూడు హైస్కూళ్లను కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేసినట్లు వెల్లడించారు. బుధవారం ఆమె నాతవరం మండలంలోని చమ్మచింత, రామన్నపాలెం, నాతవరం, హైస్కూళ్లను ఆకస్మిక తనిఖీ చేశారు. రోలుగుంట మండలంలో టీచర్‌గా పనిచేస్తున్న చమ్మచింత గ్రామస్తులు జాన్‌ప్రసాద్‌పై అదే గ్రామానికి చెందిన నేతల నల్లకొండయ్య ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈవో విచారణ జరిపారు. తర్వాత చమ్మచింత హైస్కూల్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. 9, 10 తరగతుల విద్యార్థుల నోట్ పుస్తకాలనున పరిశీలించి పలు అంశాలపై ప్రశ్నలు వేశారు. మధ్యాహ్న భోజన పదార్థాలను పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనాలు చేశారు. మధ్యాహ్న భోజనంపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆమె, రోజూ ఇలాగా వండి, విద్యార్థులకు అందించాలని హెచ్‌ఎం శివరాం ప్రసాద్‌కు సూచించారు. రామన్నపాలెం, నాతవరం హైస్కూళ్ల విద్యార్థులతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 1973 పాఠశాలల్లో 2 లక్షల 13 వేల 167 మంది విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. కొన్ని మండలాల్లో పుస్తకాలు, బ్యాగ్‌లు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. ఆగస్టు నెలాఖరు వరకు విద్యార్థుల అడ్మిషన్లు జరుగుతాయని, వీరితోపాటు మిగిలిన విద్యార్థులకు పుస్తకాలు, ఇతర సామాగ్రి సరఫరా చేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 513 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వానికి నివేదించామన్నారు. ఉపాధ్యాయ కొరత ఉన్న పాఠశాలల్లో టీచర్ల సర్దుబాటు ద్వారా బోధనకు ఇబ్బంది లేకుండా చేశామన్నారు. జిల్లాలో గత ఏడాది కూంద్రం, పాయకరావుపేట, పరవాడ, యలమంచిలి హైస్కూళ్లను కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేశామని, ఈ ఏడాది నాతవరం, అచ్యుతాపురం, రాంబిల్లి హైస్కూళ్లను జూనియర్ కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేసినట్లు పేర్కొన్నారు. నాడు నేడు పథకంలో మొదట విడత పాఠశాలల అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. రెండో విడతలో నిధులు మంజూరైన పాఠశాలల్లో పలు పనులు వివిధ దశల్లో ఉన్నట్లు వెల్లడించారు. డీఈవో వెంట ఉప విద్యాశాఖాధికారి పొన్నాడ అప్పారావు, నాతవరం ఎంఈవో కామిరెడ్డి వరహాలబాబు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.



చమ్మచింత హైస్కూల్ విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

పాలిటెక్నిక్ కళాశాలలో సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

కశింకోట: పూర్వ ఆర్‌ఈసీఎస్ ప్రధాన కార్యాలయంలోని రాజీవ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో 50 శాతం కోటా సీట్ల భర్తీకి బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. నాలుగు బ్రాంచ్‌లలో ఉన్న 120 సీట్లకు 88 సీట్లు భర్తీ అయ్యాయని ప్రిన్సిపాల్ కె.శివ తెలిపారు. సివిల్ బ్రాంచ్‌లో అధికంగా సీట్లు మిగిలిపోయాయి. మెకానికల్ బ్రాంచ్‌లో పది, సీఈసీ బ్రాంచ్‌లో 4 సీట్లు మిగిలాయి. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల కంప్యూటర్స్ హెడ్ దామోదర్ పర్యవేక్షణలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉప ప్రిన్సిపాల్ గణేష్, అధ్యాపకులు రమణకుమార్, బి.జగన్‌మోహిని, జనార్దన్‌బాబు, కె.శివరాం, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

సహోద్యోగి కుటుంబానికి బాసట

దేవరాపల్లి : విధి నిర్వహణలో విద్యుత్ షాక్‌తో కొత్తపెంట సచివాలయ ఉద్యోగి డెక్క చిరంజీవి ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబానికి సహచర ఉద్యోగులంతా బాసటగా నిలిచారు. కొత్తపెంట సచివాలయ పరిధిలోని ములకలాపల్లి గ్రామంలో చిరంజీవి మార్చి 17న ఎన్నికల విధులలో భాగంగా ఫ్లెక్సీలు తొలగిస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి ఆర్థిక సమస్యలలో చిక్కుకున్న బాధిత కుటుంబానికి సచివాలయ ఉద్యోగులతో పాటు పంచాయతీ కార్యదర్శులు ఇతర ఉద్యోగులు సమకూర్చిన రూ. 1.30 లక్షల రూపాయలను వితరణగా అందజేశారు. వీటిలో ఇద్దరు పిల్లలకు రూ.50వేలు చొప్పున డిపాజిట్ చేసి, రూ. 30 వేలు ఇంటి ఖర్చుల నిమిత్తం మృతుడి భార్య హేమలతకు స్థానిక ఇంచార్జ్ ఎంపీడీవో ఎస్.అప్పలరాజు, ఇంచార్జ్ ఈవోపీఆర్డీ జి. సంతోషి నళిని, సచివాలయ ఉద్యోగుల యూనియన్ ప్రెసిడెంట్ పి.రాజా తదితర సహచర ఉద్యోగులు చేతుల మీదుగా బుధవారం అందజేశారు. తోటి ఉద్యోగి కుటుంబానికి అండగా నిలిచిన ఉద్యోగుల సేవాభావాన్ని పలువురు ప్రశంసించారు.



మృతుడి కుటుంబ సభ్యులకు డిపాజిట్ బాండ్లు, నగదును అందజేస్తున్న ఎంపీడీవో అప్పలరాజు

ఎన్నికల తర్వాత మమ్మల్ని విస్మరించారు

- బీజేపీ నాయకుడు ఉండూరు రాజు ఆవేదన



మాడుగుల రూరల్ : ఇటీవల జరిగిన ఎన్నికలల్లో కూటమి నాయకులు కృషితో విజయం సాధించిన తర్వాత బీజేపీ నాయకులను విస్మరించారని మండల బీజేపీ అధ్యక్షుడు ఉండూరు రాజు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మాడుగుల మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులతో వేర్వేరుగా స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేశారు. అయితే ఈ సమీక్ష సమావేశానికి కూటమి పార్టీ అయిన బీజేపీ మండల అధ్యక్షునిగా తనకు ఆహ్వానం అందలేదని ఉండూరు రాజు ఎమ్మెల్యేను సమావేశం తర్వాత నిలదీశారు. ఎన్నికల్లో కష్టపడి మీ విజయానికి పనిచేస్తే, ఎన్నికల అనంతరం బీజేపీ నాయకులను విస్మరించడం తగదని అన్నారు. ఎన్నికల్లో బీజేపీ క్యాడర్‌ను ఉపయోగించుకుని నేడు కూటమి నాయకులు దేశం, జనసేన నాయకుల ఫొటోలతో ఎంపీపీ కార్యాలయం వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేసారని, ఈ అందులో తన ఫొటో పెట్టలేదని తెలిపారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ ఇక నుంచి ఇటువంటి పొరపాట్లు జరగకుండా చూస్తామని అన్నారు.

సీఎం పర్యటన సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపు

అనకాపల్లి : ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాలో ఎస్.రాయవరం మండలం దార్లపూడి గ్రామంలో పోలవరం ప్రధాన ఎడమ కాలువ అక్విడెట్ల పనుల పరిశీలన నిమిత్తం వస్తున్నందున గురువారం ట్రాఫిక్‌ను మళ్లించడం జరుగుతుందని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 1 గంట వరకూ మాత్రమే ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందని వాహనదారులు సహకరించాలని ఆయన కోరారు. నర్సీపట్నం నుంచి అడ్డురోడ్డు వెళ్లేవారు, మాకవరంపాలెం–తాళ్లపాలెం మీదుగాను, కోటవురట్ల నుంచి అడ్డురోడ్డు వెళ్లేవాహనాలు పాతరోడ్డు మీదుగా రాజుపేట–మారవరంపాలెం, అనకాపల్లి వైపు వెళ్లే వాహనాలు పాతరోడ్డు మీదుగా –చౌడువాడ–జి.కోడూరు–మాకవరపాలెం, నర్సీపట్నం నుంచి తుని, పాయకరావుపేట వెళ్లేవారు లింగాపురం–వెంకటాపురం–తాండవ జంక్షన్ మీదుగాను, అడ్డురోడ్డు నుంచి కోటవురట్ల వెళ్లేవారు తాళ్లపాలెం జంక్షన్ –మాకవరపాలెం మీదుగా నర్సీపట్నం వెళ్లాలని వాహనదారులను ఆయన కోరారు.

గంజాయితో ముగ్గురి అరెస్టు




నిందితులు, గంజాయితో పోలీసులు

రోలుగుంట : మండలంలో గంజాయి వ్యాపారులపై కొత్తకోట సీఐ ఎల్. అప్పలనాయుడు ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌ఐ ఎల్.సురేష్ సిబ్బందితో దాడులు చేశారు. వడ్డిప శివారు రత్నంపేట వైపు నుంచి వస్తున్న ఆటోని ఆపి తనిఖీ చేయగా రెండు మూటలతో 12 కిలోల గంజాయి బయటపడింది. దీంతో ఆటోలో ఉన్న అల్లూరి జిల్లాకు చెందిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్‌ఐ విలేకరులకు తెలిపారు. చింతపల్లిలో ఈ సరుకును కొనుగోలు చేసి ఆటోలో తరలిస్తూ వీరు పట్టుబడ్డారన్నారు. గంజాయి రవాణా సంపూర్ణంగా అరికట్టడమే లక్ష్యం పని చేస్తున్నామన్నారు.

వల్సంపేట జంక్షన్‌లో ఇద్దరు...

నాతవరం: గుట్టు చప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను పట్టుకుని అరెస్టు చేశామని నాతవరం ఎస్‌ఐ రామారావు తెలిపారరు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ నాతవరం మండలం వల్సంపేట జంక్షన్‌లో గంజాయి తరలిస్తున్నట్టు అందిన సమాచారంతో దాడి జరపగా విజయవాడకు చెందిన పి.సుమంత్, జి.బాలకృష్ణ గంజాయితో పట్టుబడ్డారన్నారు. వారి వద్ద నుంచి రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించామన్నారు. నిందితుల వద్ద పట్టుబడ్డ గంజాయి విలువ రూ.10 వేలు ఉంటుందని ఎస్‌ఐ తెలిపారు.

తాగి వాహనం నడిపిన వారికి రూ.10వేలు జరిమానా



కోర్టు వద్ద డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడ్డ వాహనదారులతో సీఐ పైడపునాయుడు

అనకాపల్లి : పట్టణ పరిధిలో పలు ప్రాంతాల్లో వాహనాల తనిఖీల్లో మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డ 25 మందిని కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ పైడపు నాయుడు తెలిపారు. స్థానిక కోర్టు ఆవరణలో బుధవారం ఆయన వాహనదారులతో మాట్లాడారు. వాహనాలు నడిపేటప్పుడు మద్యానికి దూరంగా ఉండాలని హితవు పలికారు. తరుచూ మద్యం సేవించి పట్టుబడిన వ్యక్తులకు జైలుశిక్ష పడుతుందన్నారు. 25 మంది వాహనదారులు రూ. 2.50 లక్షలు ప్రభుత్వానికి చెల్లించడం జరిగిందన్నారు. పట్టణ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారుల పై 68 కేసు నమోదు చేసి, రూ.6,800 జరిమానా విధించినట్టు సీఐ తెలిపారు. ట్రాఫిక్ రూల్స్‌పై పలు ప్రాంతాల్లో వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

అచ్యుతాపురం : దిబ్బపాలెం ఎస్‌ఈజెడ్ కాలనీ లక్ష్మీపురంలో నివాసం ఉంటున్న కులదీప్ సింగ్(23) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్టు సీఐ బుచ్చిరాజు తెలిపారు. ఈ మేరకు సీఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. రాజస్థాన్‌కు చెందిన కులదీప్‌సింగ్ సెజ్‌లోని ఒక పరిశ్రమలో అసిస్టెంట్ కుక్‌గా పనిచేస్తున్నారు. లక్ష్మీపురంలో నివాసముంటున్న కులదీప్ సింగ్ రెండో అంతస్తులో ఉంటూ పొరపాటున పక్క నుంచి వెళ్తున్న కరెంట్ తీగలకు చేతులు తగలడంతో విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందినట్టు సీఐ తెలిపారు.

జన విశాఖ

విశాఖ 23,85,658 | అనకాపల్లి 17,26,998 | అల్లూరి 9,53,960



ఏయూలో ఏర్పాటు చేసిన డిజిటల్ జనాభా గడియారం

- రాష్ట్రంలోనే అత్యధిక జనసాంద్రత ఉన్న జిల్లా ఇదే..
- చదరపు కి.మీకి 1,670 మంది నివాసం
- నేడు ప్రపంచ జనాభా దినోత్సవం

సాక్షి, విశాఖపట్నం: నగరం.. జనసంద్రమవుతోంది. ఓ వైపు అలలతో అలరారుతున్న సాగరం.. మరోవైపు ప్రజలతో కిటకిటలాడుతోంది. రాష్ట్రంలో అత్యధిక జనసాంద్రత కలిగిన జిల్లాగా విశాఖపట్నం నిలిచింది. అత్యధిక జనాభా ఉన్న జిల్లాల జాబితాలో రెండో స్థానంలో ఉంది. ప్రపంచ నగరాలు, దేశంలోని మెట్రో సిటీలతో పోటీ పడుతున్న విశాఖ నగరం.. అపారమైన అవకాశాలతో అందరికీ ఆహ్వానం పలుకుతోంది. పారిశ్రామికీకరణ, విద్యా సంస్థలు, పర్యాటకం, మౌలిక సదుపాయాలు, జీవన నాణ్యత తదితర అంశాలు ఇక్కడ స్థిరపడేందుకు ఆకర్షిస్తున్నాయి. అందుకే దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజలు విశాఖపట్నాన్ని తమ డెస్టినేషన్‌గా మార్చుకుంటున్నారు. అందుకే ఈ జిల్లా రాష్ట్రంలోనే అత్యధిక జనసాంద్రత కలిగిన జిల్లాగా మారింది. జిల్లాలో చదరపు కి.మీకి 1,670 మంది నివసిస్తుండటం గమనార్హం.

రాష్ట్రంలో రెండో జిల్లాగా...

జనాభా పరంగా రాష్ట్రంలో రెండో జిల్లాగా విశాఖపట్నం నిలిచింది. జూలై 7 నాటికి 24,69,712 జనాభాతో పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ప్రథమ స్థానంలో ఉండగా.. 23,85,658 మందితో విశాఖపట్నం జిల్లా రెండో స్థానంలో నిలిచింది. గతేడాదితో పోలిస్తే 2.32 శాతం జనాభా విశాఖ జిల్లాలో పెరిగింది. విస్తీర్ణ పరంగా అత్యంత చిన్న జిల్లాగా 1048 చ.కిమీ తో ఉన్న విశాఖపట్నం.. జనాభా, జనసాంద్రత విషయంలో మాత్రం అందనంత ఎత్తులో ఉండటం విశేషం. అనకాపల్లి జిల్లాలో 17,26,998 మంది జనాభా ఉండగా.. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 9,53,960 మంది నివసిస్తున్నారని ఏయూ జనగణన విభాగం వెల్లడించింది. జనసాంద్రత విషయంలో అల్లూరి సీతారామరాజు జిల్లా 77 మందితో అట్టడుగున నిలిచింది.

నాలుగో పరిశోధన కేంద్రం

భారత ప్రభుత్వం కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 18 జనాభా పరిశోధన కేంద్రాలు స్థాపించింది. వీటిలో 1956 ఢిల్లీలో స్థాపించిన జనాభా పరిశోధన కేంద్రం మొట్టమొదటి కాగా 1989 సాగర్(మధ్యప్రదేశ్) లో స్థాపించింది ఆఖరిది. ఈ క్రమంలో 1977లో ఆంధ్రా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన జనాభా పరిశోధన కేంద్రం నాల్గోది. ఈ కేంద్రాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రారంభించిన అనేక ఆరోగ్య కార్యక్రమాలు ఏ విధంగా అమలవుతున్నాయో పరిశీలించడం, పనితీరుకు సంబంధించి పరిశోధన చేయడం, తద్వారా వివిధ ఆరోగ్య పథకాలు, కార్యక్రమాల్లో ఎటువంటి మార్పుల అవసరం గుర్తించి ప్రభుత్వాలకు నివేదిక అందజేస్తాయి. జనాభా పెరుగుదలపై ప్రజలకు అవగాహన కల్పించి, చైతన్య పరచడంలో దోహదపడే విధంగా ఈ కేంద్రాల వద్ద డిజిటల్ జనాభా గడియారాలను ఏర్పాటు చేశారు. డిజిటల్ క్లాక్‌పై దేశ, రాష్ట్ర జనాభా వివరాలు ప్రత్యక్ష ప్రసారమవుతాయి.

క్లుప్తంగా

నరసింహావతారంలో జగన్నాథుడు



అనకాపల్లి : జగన్నాథ స్వామి వారి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం స్వామివారు నరసింహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో స్థానిక గూడ్స్ రోడ్డులోని ఇంద్రద్యుమ్న హాల్లో సుభద్ర, బలభద్ర సమేత శ్రీ జగన్నాథస్వామి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకుడు బంకుపల్లి సత్యనారాయణ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఉచిత ప్రసాద వితరణ చేశారు. ఆలయ ఈవో రాజసులోచన, ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి, డైరెక్టర్లు కాండ్రేగుల వెంకట వీర అప్పారావు, బుగత కోటేశ్వరరావు, యల్లమల్లి ధనలక్ష్మి, బుద్ధ లక్ష్మీ అప్పారావు, శరగడం కృష్ణ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న జగన్నాథస్వామి ఉత్సవాల్లో భాగంగా స్వామిని వరహా లక్ష్మీనృసింహస్వామిగా అలంకరించి బుధవారం ప్రత్యేక పూజలు జరిపారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. భక్తుల గోత్ర నామాలతో పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, మారుతి, శ్రీరామ చరణాచార్యులు పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

'స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి'

అనకాపల్లి : వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించే ప్రక్రియను తక్షణమే నిలుపుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తొలిసారి జిల్లాకు వస్తున్న సందర్భంగా వ్యవసాయ పంపు సెట్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై తమ వైఖరిని బహిర్గతం చేయాలని కోరారు. ప్రస్తుతం ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అధికారంలోకి రాక ముందు చేపట్టిన యువగళం యాత్రలో వ్యవసాయ పంపు సెట్ల స్మార్ట్ మీటర్లను ధ్వంసం చేయాలని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేస్తామని చెప్పారన్నారు. నేడు తాము అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వ నిర్ణయాన్నే అమలు చేయడమంటే రైతులను మోసం చేయడం తప్ప మరొకటి కాదన్నారు.

అనకాపల్లి సినిమాలు

మహారాజ	:రాజా
కల్కి2898 ఏడీ	:సత్యనారాయణ స్క్రీన్-1
కల్కి2898 ఏడీ	:సత్యనారాయణ స్క్రీన్-2
కల్కి2898 ఏడీ	:షిర్డిసాయి
కల్కి2898 ఏడీ	:పర్తిసాయి
మనమే	:వెంకటేశ్వర
రాజధాని రౌడీ	:శ్రీసత్య
హనీమూన్ ఎక్స్‌ప్రెస్	:రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 32 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,660	5,230
రెండో రకం	--	--
మూడోరకం	3,100	3,500

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 47 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-19 యూనిట్లు, ఓ పాజిటివ్-23 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 363 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 319 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

ఈ రోడ్డు దాటాలంటే భయం భయం

కశింకోట జాతీయ రహదారి వాహన చోదకులు, పాదచారులను భయపెడుతోంది. ఈ రోడ్డును దాటాలంటే చుక్కలు కనిపిస్తాయని అంతా చెబుతున్నారు. అత్యంత వేగంగా వాహనాలు దూసుకు రావటం.. వాటిని నియంత్రించేందుకు సిగ్నల్ లైట్లు లేకపోవటమే దీనికి కారణమని స్థానికులు వాపోతున్నారు. స్టాప్ బోర్డులు, జీబ్రా లైన్లు ఉన్నా వాహనాల వేగం మాత్రం తగ్గడం లేదంటున్నారు. ఇక్కడ వాహనాల వేగం నియంత్రించేందుకు సిగ్నల్ లైట్ల ఏర్పాటు.. ట్రాఫిక్ నిబంధనల అమలు తప్పనిసరి అని వాహన చోదకులు.. పాదచారులు చెబుతున్నారు.



కశింకోట కూడలిలో వెల్లువలా వస్తున్న వాహనాలు

- వణికిస్తున్న కశింకోట జాతీయ రహదారి
- వెల్లువలా దూసుకు వచ్చే వాహనాలతో ఉక్కిరిబిక్కిరి
- సిగ్నల్ లైట్లు లేకపోవడమే కారణమంటున్న స్థానికులు

కశింకోట : ఇక్కడి జాతీయ రహదారి కూడలి ప్రమాదకరంగా ఉంది. ఏ క్షణాన ఎటువంటి ప్రమాదానికి గురి కావలసి వస్తుందోనని ప్రజలు, వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. రోడ్డుకు రెండు వైపులా వాహనాలు వెల్లువలా ఒకదాని వెంట ఒకటి వేగంగా వస్తుండటంతో రోడ్డు దాటడానికి ప్రజలు, వాహన చోదకులు అష్టకష్టాలు పడుతున్నారు. అడపా దడపా ప్రమాదాలు కూడా జరుగుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. ప్రధాన కూడలి అయినప్పటికీ సిగ్నల్ లైట్లు లేకపోవడం ఈ పరిస్థితికి కారణం. కశింకోట గ్రామంలో సుమారు 20 వేల జనాభా ఉంది. వీరితో పాటు మండల కేంద్రం కావడం వల్ల మండల గ్రామాలతో పాటు చుట్టు పక్కల ఉన్న అనకాపల్లి, మునగపాక, అచ్యుతాపురం మండల గ్రామాల నుంచి ఇక్కడికి నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. వీరు తమ ప్రాంతాలకు వెళ్లాలంటే అత్యధిక శాతం మంది కశింకోట గ్రామం మధ్యగా వెళ్తున్న జాతీయ రహదారిని ఇక్కడి కూడలి వద్దే దాటాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ ప్రవాహంలా వాహనాలు వరుస కట్టి విరామం లేకుండా రాకపోకలు సాగిస్తుంటాయి. స్టాప్ బోర్డులు, జీబ్రా లైన్లు ఉన్నా, పోలీసులు కాపలా ఉన్నా వాహనాల వేగం మాత్రం తగ్గడం లేదు. సాయంత్రం, ఉదయం సమయంలో మరింత రద్దీ వల్ల ఇక్కడి కూడలి దాటాలంటే గగనంగా మారుతోంది. డీపీఎన్ జెడ్పీ హైస్కూలు ఒక వైపు, మరో వైపు బాలికల హైస్కూలు, బీసీ సంక్షేమ వసతి గృహం ఉన్నాయి. దీంతో ఆయా స్కూళ్లకు రాకపోకలు సాగించడానికి అటు, ఇటు కూడలిని నిత్యం విద్యార్థులు దాటాల్సి ఉంటుంది. వీరితో పాటు అనకాపల్లి వైపు వెళ్లే ప్రజలు, వాహన చోదకులు, అటువైపు సంపతిపురం, తమ్మయ్యపేట, ఇతర గ్రామాల నుంచి వచ్చే ప్రజలు కూడలి వద్ద రోడ్డు దాటాల్సి ఉంటుంది. అయితే వేగంగా వచ్చే వాహనాల వల్ల రోడ్డు దాటడానికి ఎక్కువ సమయం నిరీక్షించాల్సి వస్తోంది. పోలీసులు స్టాప్ బోర్డులు పెట్టి వాహన వేగాన్ని అదుపు చేసే ప్రయత్నం చేస్తున్నారు. అయినా వాటి వేగం తగ్గడం లేదు. హోంగార్డు ఉదయం, సాయంత్రం సమయాల్లో ఉండి వాహనాలను అదుపు చేసే ప్రయత్నం చేస్తుంటారు. ఏ మాత్రం ఏమరుపాటుగా రోడ్డు దాటినా ప్రమాదం కొని తెచ్చుకుంటున్న పరిస్థితి. గతంలో పలువురు రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందడం, క్షతగాత్రులు కావడం వంటి సంఘటనలున్నాయి. దీంతో రోడ్డు దాటాలంటే బిక్కుబిక్కుమనాల్సిన పరిస్థితిని ప్రజలు, విద్యార్థులు, వాహన చోదకులు ఎదుర్కొంటున్నారు. పరిస్థితి నివారణకు కూడలిలో సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలని జాతీయ రహదారి అధికారులను చాలా కాలంగా కోరుతున్నారు. అయినప్పటికీ ప్రయోజనం లేకపోతోంది. ఇటీవల కూడలిలో జాతీయ రహదారి అధికారులు వెలుగు కోసం 20 సోలార్ లైట్లు ఏర్పాటు చేశారు. ఇవి రాత్రి వేళ సౌకర్యవంతంగా ఉన్నాయి. అలాగే వాహనాల వేగాన్ని నియంత్రించడానికి కూడలిలో సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



కూడలిలో రోడ్డు దాటుతున్న బాలికలు

సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలి..

కశింకోట కూడలిలో సోలార్ లైట్లు ఏర్పాటు చేయడంతో సౌకర్యవంతంగా ఉంది. అలాగే వాహనాల రద్దీ నియంత్రణకు కూడలిలో సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలి. రోడ్డు దాటడం ప్రమాదకరంగా ఉంది. ప్రవాహంలా వస్తున్న వాహనాల రద్దీ వల్ల తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందాల్సి వస్తోంది. సత్వరమే సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలి.

– పంచదార్ల శ్రీను, ఆటో డ్రైవర్, కశింకోట.

నిబంధనలు పాటించాలి..

కశింకోట కూడలిలో రోడ్డు దాటడం అతి కష్టంగా ఉంది. జీబ్రా క్రాసింగ్ లైన్లు ఉన్నప్పటికీ వాహనాల వేగం తగ్గడం లేదు. ఇక్కడ ఇండికేషన్ లైట్ వెలుగుతున్నా, స్టాప్ బోర్డులున్నా ట్రాఫిక్ నిబంధనలు పాటించడం లేదు. దీని వల్ల రోడ్డు దాటడానికి అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. దీని దృష్ట్యా సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలి. వాహన చోదకులు నిబంధనలు పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఎస్. విశ్వనాథం, కశింకోట.

పాడి రైతులకు పశుగ్రాసాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి జార్జ్

కశింకోట: పశువులకు మేలైన పోషణ అందించే పశుగ్రాసాలను పాడి రైతులు పెంచుకోవాలని మండల పశు వైద్యాధికారి ఆల్ఫోన్సా జార్జ్ సూచించారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని వెదురుపర్తిలో పాడి రైతులకు పశుగ్రాసాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు మేలైన పోషణ అందివ్వడానికి నీటి పారుదల ఎక్కువగా ఉండే మొక్కజొన్న, అలసందలు, హైబ్రిడ్ నేపియర్, పిల్లి పెసర వంటి పశుగ్రాసాలను పెంచుకోవాలన్నారు. నీటి వసతి అనుసరించి పశుగ్రాసాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. నీటి వసతి లేకుంటే జొన్నలు, సజ్జలు పెంచుకోవాలన్నారు. సుబాబుల్, అవిస, మునగ, గంగిరావి వంటి పశుగ్రాస చెట్లను పెంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ శనివాడ అరుణ, ఎంపీటీసీ సభ్యుడు రాము, మాజీ సభ్యుడు పందల ఎల్లయ్యనాయుడు, స్థానిక నాయకులు సగరపు నాయుడు, మేడిది నాయుడు, కె.రమణ తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని ర్యాలీ

కశింకోట: డిమాండ్స్ డే (కోర్కెల దినం)లో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో పలు ప్రజా సంఘాలు బుధవారం కశింకోటలో ర్యాలీ, తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించాయి. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు.

అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ప్రజా సంఘాల ప్రతినిధులు టి.తనూజ, కె.శాంతి, కె.నాగరాజు, సాయిరాం, మణి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి



ఐసీయూలో రోగితో మాట్లాడుతున్న శంకరరావు

అనకాపల్లి : నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో సెఫటాక్సిమ్ ఇంజక్షన్ వికటించి అస్వస్థతకు గురైన 21 మంది రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఆర్.శంకరరావు అన్నారు. స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో చికిత్స పొందుతున్న రోగులను బుధవారం పరామర్శించారు. రోగులను ఇబ్బందులకు గురి చేసిన ఇంజెక్షన్‌పై పూర్తిస్థాయి దర్యాప్తు చేయాలని, అంత వరకు దానిని వినియోగించరాదని కోరారు. వర్షాలు పడుతున్న కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు వివిధ రకాలైన వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం పూర్తిసాయిలో మందులు సరఫరా చేయాలని కోరారు. సీపీఎం సీనియర్ నాయకులు వి.వి.శ్రీనివాసరావు, అల్లు రాజు, నగిరెడ్డి సత్యనారాయణ, పొంగి చలపతిరావు పాల్గొన్నారు.

బాధితులకు వైఎస్సార్‌సీపీ నేతల పరామర్శ



ఆస్పత్రిలో బాధితులను పరామర్శిస్తున్న వీసం

నక్కపల్లి: ఇంజక్షన్ వికటించి నక్కపల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను బుధవారం రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ తదితరులు పరామర్శించారు. ఇంజక్షన్ వికటించి 21 మంది అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. వీరిలో 17 మందిని అనకాపల్లి ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మిగిలిన వారు నక్కపల్లిలో చికిత్స తీసుకుంటున్నారు. వీరిని వీసం పరామర్శించారు. ఆయన వెంట సర్పంచ్ తళ్ల భార్గవ్, స్టూడెంట్ విభాగం జిల్లా అధ్యక్షుడు హరి ఉన్నారు.

ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడిన మాజీ ఎమ్మెల్యే జోగులు

అనకాపల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల ఆరోగ్య పరిస్థితిని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి కంబాల జోగులు తెలుసుకున్నారు. బుధవారం ఆయన ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో ఫోన్‌లో మాట్లాడారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. 17 మందిలో 15 మంది పూర్తిగా కోలుకున్నారని వారిని ఇళ్లకు పంపించామని, మిగిలిన వారికి ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నట్టు సూపరింటెండెంట్ తెలిపారని జోగులు చెప్పారు.

నేడు మూడో విడత చందన అలంకరణ

అనకాపల్లి : స్థానిక గవరపాలెంలో గల శ్రీ వరహా లక్ష్మీనృసింహ స్వామి వారి దేవాలయంలో స్వామి వారికి మూడో విడత చందన అలంకరణ ఈనెల 11న చేపడుతున్నట్లు ఆలయ ప్రతినిధి మళ్ల రామచంద్రరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లవారు జాము 6 గంటలకు స్వామివారికి స్వర్ణ సంపెంగ పుష్పార్చన కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు ఆరవెల్లి సత్యప్రసాదాచార్యులు నిర్వహిస్తారన్నారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామివారిని ఆయన కోరారు.

విద్యార్థులకు యూనిఫారాల పంపిణీ

కశింకోట : మండలంలోని ఉగ్గినపాలెంలో విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన పుస్తకాలు, యూనిఫారాలు బుధవారం పంపిణీ చేశారు. ఎంపీపీ కలగా లక్ష్మి, సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, టీడీపీ నాయకుడు కలగా సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి ఉపాధి శిక్షణ తరగతులు

అనకాపల్లి : నిరుద్యోగుల ఉపాధి కల్పనకు 81 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో పలు కోర్సుల్లో శిక్షణ అందించనున్నట్లు గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జన శిక్షణ సంస్థాన్ సహకారంతో ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. టైలరింగ్, బ్యూటీషియన్, డాటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుల్లో ఈ శిక్షణ ఇస్తామన్నారు. ఈనెల 12 నుంచి తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో పాల్గొనే నిరుద్యోగులు ముందుగా గ్రంథాలయంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9247166511, 9247187355 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు. నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణలో భాగంగా అందజేస్తున్న ఈ కార్యక్రమాన్ని యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

ఆకస్మిక వర్షంతో రహదారులు జలమయం



కనకమహాలక్ష్మి వీధిలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

కశింకోట : ఈ ప్రాంతంలో బుధవారం మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురిసింది. అకస్మాత్తుగా కురిసిన వర్షంతో పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. స్థానిక కనకమహాలక్ష్మి వీధి, పీహెచ్‌సీకి వెళ్లే రోడ్డు తదితర ప్రాంతాల్లో నీరు చేరింది. మురుగు కాలువలు నిండి రోడ్డుపై ప్రవహించాయి. దీంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

ఎన్‌సీసీని పరిరక్షించాలని వినతి



ఏవోకు వినతిపత్రం అందిస్తున్న జాజుల రమేష్, ఉగ్గిన అప్పారావు

అనకాపల్లి: స్థానిక మెయిన్ రోడ్డులోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో 1964లో ఏర్పాటు చేసిన ఎన్‌సీసీని నేటి పాలకులు పట్టించుకోక పోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు ఉగ్గిన అప్పారావు అన్నారు. ప్రస్తుతం ఉన్న ఎన్‌సీసీని కాపాడుకోవలసి బాధ్యత మన అందరిపై ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం జీవీఎంసీ విలీన గ్రామమైన ఈడీవో కార్యాలయంలో ఏవోకు వారు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఎన్‌సీసీ కోటాలో వేలాది మంది విద్యార్థులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారని గుర్తు చేశారు.

కార్మికుల సమస్యలపై సీఐటీయూ ధర్నా



ఆర్డీవో చిన్నికృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

అనకాపల్లి: కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ అఖిల భారత కమిటీ పిలుపు మేరకు డిమాండ్స్ డేలో భాగంగా బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, ఆర్డీవో ఎ.జె.చిన్నికృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలతోపాటు బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని, మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. ముఠా కార్మికులకు సమగ్ర చట్టంతోపాటు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, వెలుగు వీవోఏలకు కాల్ పరిమిత సర్క్యులర్ రద్దు చేసి రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. కేంద్రంలో మూడో సారి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపడం ప్రారంభించిందని, ఇప్పటికే మొబైల్ రీచార్జ్‌లను విపరీతంగా పెంచిదన్నారు. న్యాయ చట్టాలను తెచ్చి సామాన్యులకు ముఖ్యంగా రవాణా రంగ కార్మికులకు గొడ్డలిపెట్టుగా మారిందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి వి.వి.శ్రీనివాసరావు, ముఠా కార్మిక సంఘం నాయకుడు భీశెట్టి అప్పారావు, పంచాయతీ కార్మికులు, యూనియన్ నాయకులు ఎం.అప్పలరాజు, చెన్నారావు సంధ్య, వీవోఎల్ యూనియన్ నాయకులు మళ్ల లక్ష్మి, రాము, బిల్డింగ్ యూనియన్ నాయకులు లక్ష్మణ్, శంకరరావు, పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం అభివృద్ధి పనులకు శ్రీకారం



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న సర్పంచ్ పెంటయ్యనాయుడు

అనకాపల్లి : తుమ్మపాలలో ప్రజల సమస్యలు దశల వారీగా పరిష్కరించనున్నట్లు సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు తెలిపారు. మండలంలో తుమ్మపాల గ్రామం ఇందిరానగర్ (ఎస్సీ కాలనీ)లో శిథిలావస్థలో ఉన్న కల్యాణ మండపం మరమ్మతుల నిమిత్తం రూ.10 లక్షలతో అభివృద్ధి పనులకు బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్యాణ మండంలో కనీస సదుపాయలు లేవని, ఈ నిధులతో తాగునీరు, మరుగుదొడ్లు, ఇతక సౌకర్యాలకు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. రెండు మాసాల్లో కల్యాణ మండపం పనులు పూర్తి చేసి ప్రజల అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వద్దాది భారతి అశోక్, వార్డు మెంబర్లు రవ్వా భవానీ శ్రీను, తర్ర సత్యారావు, ముత్యాల అప్పారావు, కోన గాంధీ, దుర్గ, కశింకోట అప్పలకొండ, బంగారు పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

నిపుణుల సూచనలతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీధర్

కశింకోట : నిపుణుల సూచనలు అనుసరించి రైతులు ఖరీఫ్‌లో అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీధర్ తెలిపారు. మండలంలోని తాళ్లపాలెంలో ఆత్మ ఆధ్వర్యంలో జిల్లా వనరుల కేంద్రం తరఫున రైతులకు బుధవారం ఖరీఫ్ పంటల యాజమాన్య పద్ధతులు, మెలకువలు బోధించారు. మట్టి నమూనా పరీక్షల ద్వారా ఎటువంటి ఎరువులు వాడాలో తెలుసుకోవాలన్నారు. వాతావరణ పరిస్థితులను అనుసరించి అందుకు అనువైన పంటల సాగుతో లాభం గడించాలన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన పంటలు పండించడానికి దోహదపడాలన్నారు. కార్యక్రమంలో వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి పి. విజేత, మండల వ్యవసాయ అధికారి ఎం.స్వప్న, మాకవరపాలెం ఏవో సీహెచ్ చిరంజీవి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

బొజ్జన్నకొండ ప్రాంతంలో చోరీలు

- అధికారులు దృష్టి సారించాలని విజ్ఞప్తి

అనకాపల్లి: మండలంలోని తుమ్మపాల బొజ్జన్నకొండ సమీప రహదారిలో చోరీలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. తుమ్మపాల పంచాయతీ పరిధిలో ఏలేరు కాలువ రహదారి నుంచి బొజ్జన్న కొండ మీదుగా జాతీయ రహదారి శంకరం గ్రామం వరకూ గతంలో ఎంపీ బి.వి.సత్యవతి ఎంపీ నిధులు సుమారు రూ.12 లక్షలతో 41 సోలార్ ల్యాంప్‌లు ఏర్పాటు చేశారు. చీకటిగా ఉన్న రహదారిని దృష్టిలో పెట్టుకుని ఈ చర్యలు చేపట్టారు. బొజ్జన్నకొండకు వచ్చే యాత్రికులు, రైతులకు, భారీ లారీ వాహనాల రాకపోకలకు ఎంతగానో ఉపయోగపడుతున్న సమయంలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి సోలార్ ల్యాంప్, ప్యానల్ బోర్డు చోరీకి పాల్పడ్డాడు. ప్రస్తుతం 40 లైట్లు మాత్రమే పనిచేస్తున్నాయని, దీనిపై పోలీస్‌లు, అధికార యంత్రాంగం దృష్టి సారించకపోతే దశలు వారిగి మిలిలిన సోలార్ లైట్లు చోరీకి గురై అవకాశాలు ఎక్కుగా ఉన్నాయని ఆయా ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇదే రహదారిలో రెండు గృహాల్లో దొంగలు చోరీకి పాల్పడారు. ప్రస్తుతం ఒక్క లైట్ ధర రూ.30 వేలు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.



చోరీకి గురైన సోలార్ లైట్

ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు



ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు చేస్తున్న ఉద్యోగులు



పరిశీలిస్తున్న ఏఈ శ్రీనివాసరావు

అనకాపల్లి : తుప్పు పట్టిన ట్రాన్స్‌ఫార్మర్ పేరిట మంగళవారం సాక్షిలో ప్రచురితమైన వార్తకు విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. డి–1 సెక్షన్ ఏఈ శ్రీనివాసరావు ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు పనులు చేపట్టారు. ఎర్తింగ్, సెక్షన్ ఫీజుల మార్పు, కేబుల్ మరమ్మతు పనులు, వీధిలైట్ల ఏర్పాటు వంటివి చేపట్టారు. ఈ పనుల పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.